రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6:28	5:11
నంద్యాల	6:27	5:10

అంగవైకల్యం అడ్డు కాలేదు..



తండ్రి, సోదరి సహాయంతో పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థిని స్రవంతి

హొళగుంద, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆమెకు అంగవైకల్యం అడ్డం కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారంతో పదో తరగతి చదివింది. సోమవారం తండ్రి, సోదరి సా యంతో ఆమె పరీక్షలు రాయడానికి కేంద్రానికి వచ్చింది. హొళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, రత్నమ్మ దంపతులు పొలం పనులు చేసుకొని జీవిస్తున్నారు. వారి పెద్ద కుమార్తె స్రవంతికి పుట్టుకతోనే కాళ్ళ, చేతులు పని చేయక వైకల్యానికి గురైంది. అయినా బాలిక చదువుకు వైకల్యం అడ్డం కాలేదు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలో పది చదివి హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాయడానికి సిద్ధమైంది. తండ్రి, చెల్లెలు నందిని సహకారంతో పరీక్ష కేంద్రానికి వచ్చింది.



కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

పది పరీక్షలు ప్రారంభం

- స్కూల్ అసిస్టెంట్‌పై వేటు
- ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు
- హొళగుంద పరీక్ష కేంద్రంలో విధుల నుంచి ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్ల తొలగింపు
- కడప ఆర్జేడీకి సరెండర్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగుతాయి. మొదటి రోజున మొత్తం విద్యార్థులు 32,130 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 31,430 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 700 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 97.82 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు మొత్తం 31,461 మంది, ప్రైవేటు విద్యార్థులు 644 మంది, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 25 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా 172 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయిలో బెంచీలను ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు, పరీక్షల నిర్వాహకులు విఫలమయ్యారు. చాలా ప్రాంతాల్లో పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఎండవేడిమికి తోడు పరీక్ష కేంద్రాల్లోని ఫ్యాన్లు తిరగక విద్యార్థులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. మరికొన్ని చోట్ల పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నా నిరూపయోగంగా కనిపించాయి. హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఫర్నీచర్ కొరత కారణంగా నేలపైనే విద్యార్థులను కూర్చోబెట్టి పరీక్షలు రాయించారు. ఈ దృశ్యాల ఫొటోలను కలెక్టర్‌కు చేరవేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పంపావతి గౌడు, పి.కబీర్‌లను విధుల నుంచి తొలగించి కడప ఆర్జేడీకి జిల్లా విద్యాశాఖ అధికారి సరెండర్ చేశారు. ఆ స్థానంలో మరొకరికి విధులు కేటాయించి ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయాలని హొళగుంద మండల విద్యాశాఖ అధికారికి డీఈవో శ్యామూల్ పాల్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే జొన్నగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష జరుగుతున్న సమయంలో అనుమతి లేకుండా పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఉపాధ్యాయుడు టి.కేశన్నను డీఈవో శామ్యూల్ పాల్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ఎస్‌ఏపీ క్యాంపు, కట్టమంచి మున్సిపల్ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో ఒకరు, జొన్నగిరి జడ్పీహెచ్‌ఎస్ పరీక్ష కేంద్రంలో ఒక స్టూడెంట్ మీద మాల్ ప్రాక్టీసు కేసులు బుక్ చేశారు. పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రత్యేకంగా నడపకపోవడంతో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు బంధువులు ఇబ్బందులు పడ్డారు. మొదటిరోజు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువులతో ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రం బయటే విద్యార్థుల హాల్ టికెట్ నెంబర్లను చెక్ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాలను కడప ఆర్జేడీ శామేల్, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్‌తో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాల సభ్యులు తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు గతంలో ఇచ్చిన హెల్ప్ డెస్క్ నెంబరును మార్చివేసి వేరే నెంబరును కేటాయించడంతో తమ సమస్యలను విద్యార్థులు, తల్లిదండ్రులు ఎవరికి చెప్పుకోవాలో ఇబ్బందులు పడ్డారు. సోమవారం డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జి ఫోన్.నెం. 9493375447, 9440972477, ప్రభుత్వ పరీక్షల విభాగం మొబైల్ నెంబర్ 9849932289, జిల్లా విద్యాశాఖ అధికారి ఫోన్ నెంబరు.9849909113లను ఏర్పాటు చేశారు.



కర్నూలు నగరంలోని ఏ క్యాంపులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థిని

అమ్మ సాయంతో పరీక్షలకు...



హొళగుంద, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విధి వక్రించినా అమ్మ ఆసరాతో పరీక్షలు రాయడానికి 10 పరీక్షలకు బాలుడు సోమవారం కేంద్రానికి వచ్చాడు. హొళగుంద లోని రాజనగర్ కాలనీకి చెందిన పి.శిలారమ్మ, సాయిబాబా దంపతులు కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. వారికి ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. పెద్ద కుమారుడైన రసూల్ కాళ్లు చేతులు లేకుండా పుట్టాడు. తల్లి కూలీ పనులు వదులుకొని రసూల్‌ని పాఠశాలలకు తీసుకువెళ్లి వస్తుండేది. భవిత కేంద్ర ఉపాధ్యాయుల సహకారంతో జడ్పీ ఉన్నత పాఠశాలలో 10 పరీక్షలకు రసూల్ సిద్ధమయ్యాడు. తొమ్మిదో తరగతి విద్యార్థిని జక్రా అనే బాలిక బాలుడు చెప్పిన జవాబులు రాసేందుకు విద్యాశాఖ అధికారులు అనుమతి ఇచ్చారు.



హొళగుంద లోన జడ్పీ ఉన్నత పాఠశాలలో నేలపైనే కూర్చొని పరీక్షలు రాసేందుకు సిద్ధమైన విద్యార్థులు

మరబోట్లతో ఇసుక తవ్వకం కష్టం

- ఉచిత పాలసీ నేపథ్యంలో అక్రమ ఇసుక వ్యాపారం
- ప్రస్తుతం పని చేస్తున్నది నాలుగు బోట్లే
- నదిచాగి, గుండికంబాలి రీచులే ఆధారం
- తీర గ్రామాలకు ఉచితంగా ఇసుక
- ఆ ముసుగులో పెట్రేగిపోతున్న అక్రమార్కులు



సుంకేసుల జలాశయం వెనుక తుంగభద్రలో కె. సింగవరం రీచ్‌లో బోట్ల ద్వారా ఇసుక తవ్వకాలు (ఫైల్)

కర్నూలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె డీసిల్టేషన్ రీచుల్లో (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) మరబోట్లతో ఇసుక తవ్వకాలకు కష్టంగా మారింది. ప్రస్తుతం రెండు రీచ్‌ల్లో నాలుగు మరబోట్లు పని చేస్తున్నాయి. త్వరలో ఆ బోట్లు కూడా ఒడ్డుకు చేర్చే పరిస్థితి ఉంది. నదిచాగి, గుడికంబాలి రీచ్‌ల్లో లక్ష టన్నులకు పైగా ఇసుక ఉన్నా.. కర్నూలు నగరానికి చేర్చాలంటే 125-150 కిలోమీటర్లు రవాణా చార్జీలు భరించాలి. వినియోగదారుడికి భారం తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం 'ఉచిత ఇసుక పాలసీ' తీసుకొచ్చింది. నదులు, వంకలు, వాగుల్లో సమీప గ్రామాల ప్రజలు ఉచితంగా ఇసుకను తీసుకు వెళ్లవచ్చు. ఆ ముసుగులో అక్రమార్కులు ఇసుక వ్యాపారానికి తెర తీశారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి కథనం.

జిల్లాలో తుంగభద్ర నదిలో కౌతాళం మండలం నదిచాగి వద్ద 9.8 హెక్టార్లు, గుడికంబాళి గ్రామం వద్ద 10 హెక్టార్లు, మరళి గ్రామం వద్ద 5 హెక్టార్లు ఇసుక ఓపన్ రీచ్‌లు గుర్తించారు. సుంకేసుల జలాశయం ఎగువన సి. బెళగల్ మండలం పరిధిలో కొత్తకోట, కె. సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీసిల్టేషన్ రీచుల్లో (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్ను రూ.650లకు పైగా చెల్లిస్తే.. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు చేయడం వల్ల ప్రభుత్వం నిబంధనలు ప్రకారం ఇసుక తవ్వకాలు చేసిన బోటింగ్, లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.202 మాత్రమే తీసుకొని ఉచిత ఇసుక రవాణా చేస్తున్నారు. కర్నూలు నగరంలో వైసీపీ హయాంలో 18 టన్నుల టిప్పరు ఇసుక రూ.18-20 వేలకు పైగా విక్రయిస్తే.. ప్రస్తుతం రూ.10 వేలులోపే ఇస్తున్నారు. వేసవి కావడంతో భవన నిర్మాణాలు జోరందుకున్నాయి. ఇసుకకు డిమాండ్ పెరిగింది. అయితే.. తుంగభద్ర నది ఒట్టిపోయింది. సుంకేసుల జలాశయం గరిష్ఠ నీటి మట్టం 292 మీటర్లు, సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా.. ఆదివారం 289.80 మీటర్ల వద్ద 0.507 టీఎంసీలు నిల్వకు పడిపోయింది. అంటే.. సుంకేసుల జలాశయం క్రమక్రమంగా అడుగంటుతోంది. కొత్తకోట, కె. సింగవరం డీసిల్టేషన్ నుంచి రోజుకు నాలుగు బోట్ల ద్వారా 4 వేల టన్నులు ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ప్రస్తుతం కె. సింగవరం రీచ్‌లో ఒక్కటే బోటు ద్వారా నదిలో ఇసుక తీసుకున్నారని ఇసుక రవాణాదారులు అంటున్నారు. జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతే ఆ బోట్లు కూడా ఒడ్డుకు చేరే పరిస్థితి ఉంది. అదే జరిగితే తగ్గిపోతే కర్నూలు నగరం సహా పరిసర గ్రామాలు ప్రజలకు ఇసుక కష్టాలు తప్పవని అంటున్నారు.

టీబీ డ్యాం నుంచి సుంకేసులకు తాగునీరు

తుంగభద్ర డ్యాంలో కేసీ కెనాల్ మిగులు నీటివాటా 1.61 టీఎంసీలు ఉంటే.. ఈ నెల 5వ తేది నుంచి రోజుకు 2,500 క్యూసెక్కులు చొప్పున 13వ తేది వరకు తీసుకున్నాం. ఈ నీరు శనివారం సాయంత్రానికి సుంకేసులకు చేరాయి. ప్రస్తుతం 1,250 క్యూసెక్కులు సుంకేసులకు చేరుతుంది. ఎగువన ఇరువైపు ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నదితీర గ్రామాల ప్రజలు ఎక్కడికక్కడే నదికి అడ్డువేసి నీటిని ఆపేస్తే.. సుంకేసులకు ఎప్పుడైనా నీటి చేరిక ఆగిపోయే ప్రమాదం ఉంది. కాగా.. తాగునీటి కోసం 0.880 టీఎంసీలు ఉండేలా నిర్వహణ చేస్తామని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. ఆ స్థాయిలో నీట నిల్వ ఉంటే మరబోట్ల ద్వారా ఇసుక తవ్వకాలు చేసి అవసరమైన మేరకు ఇసుక సరఫరా చేయవచ్చని మైనింగ్ అధికారులు భావిస్తున్నారు. పెరుగుతున్న ఎండల తీవ్రత ఓ వైపు.. కర్నూలు నగరవాసుల దాహం తీర్చేందుకు రోజుకు 189 క్యూసెక్కులు కేసీ కాలువకు విడుదల చేస్తున్నారు. మరబోట్ల ద్వారా ఇసుక తవ్వకాలకు కష్టతరం అవుతుందని అంచనా వేస్తున్నారు.

- ఆ రీచ్‌లే ఆధారం!

కౌతాళం మండలం నదిచాగి వద్ద 9.8 హెక్టార్లు, గుడికంబాళి గ్రామం వద్ద 10 హెక్టార్లు, మరళి గ్రామం వద్ద 5 హెక్టార్లు ఇసుక ఓపన్ రీచ్‌లు గుర్తిస్తే.. ప్రస్తుతం నదిచాగి, గుడికంబాలి ఓపన్ రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అక్కడ లక్ష టన్నులకు పైగా ఇసుక నిల్వలు ఉన్నాయి. రోజుకు 1,200 టన్నుల ఇసుక రవాణా చేస్తున్నారు. సుంకేసుల జలాశయంలో నీటి నిల్వలు అడుగంటితే.. కర్నూలు నగర ప్రజలు ఇసుక కోసం నదిచాగి, గుడికంబాలి రీచ్‌లపై ఆధార పడాల్సి వస్తుంది. అదే జరిగితే.. అక్కడి నుంచి కర్నూలుకు ఇసుక చేరాలంటే 125-150 కిలోమీటర్లు రవాణా చార్జీలు భరించక తప్పదు. ప్రస్తుతం కొత్తకోట, కె. సింగవరం రీచుల నుంచి రవాణా చేసే 18 టన్నులు ఇసుక రూ.10 వేలు పడితే.. నదిచాగి నుంచి కర్నూలుకు చేర్చాలంటే రవాణా చార్జీలతో కలసి 18 టన్నుల ఇసుక టిప్పర్ రూ.18-20 వేలు అవుతుందని, భవన నిర్మాణదారులపై రవాణా భారం తడిసిమోపెడు అవుతందని ఓ టిప్పర్ యజమాని పేర్కొనడం కొసమెరుపు.

- నదితీర గ్రామాల్లో ఉచితం

కౌతాళం మండలం మేళిగనూరు నుంచి కర్నూలు నగరం వరకు సుమారు 135 కిలో మీటర్లకు పైగా తుంగభద్ర నది ప్రవహిస్తుంది. కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి. బెళగల్, కర్నూలు మండలాల పరిధిలోని నదితీర గ్రామాలు సహా సమీప గ్రామాలు, పట్టణాల ప్రజలు స్వంత అవసరాల కోసం ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చు. అలాగే.. పత్తికొండ నుంచి కర్నూలు వరకు హంద్రీ నది, ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో ప్రవహించే హగరి నది తీరంలోని హాలహర్వి, హొళగుంద మండలాల గ్రామాల ప్రజలు, జిల్లాలోని వంకలు, వాగులు నుంచి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా ఉచిత ఉసుకను తీసుకువెళ్లవచ్చని మైనింగ్ అధికారులు తెలిపారు. అయితే ఎక్కడ కూడా ఎక్స్‌కవేటర్లు (యంత్రాలు) ద్వారా కాకుండా మనుషులతో ఇసుక తవ్వకాలు చేయాని అంటున్నారు. అయితే.. ఉచిత ఇసుక పేరిట అక్రమార్కులు కొందరు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నారు. వారికి అధికార కూటమి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అండదండలు ఉండడంతో ఇసుక వ్యాపారంగా మారింది. దీనినే అనువుగా మార్చుకొని పోలీసు, రెవిన్యూ అధికారులు కాసుల వేట కొనసాగిస్తున్నారు.



ఇసుకను ఒడ్డుకు చేరుస్తున్న బోట్లు (ఫైల్)

ఎమ్మెల్సీగా బీటీ నాయుడు ఎన్నిక

డిక్లరేషన్ అందజేసిన ఎన్నికల అధికారి



ఎన్నికల అధికారి వనితరాణి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

కర్నూలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీగా బీటీ నాయుడు ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శాసనమండలి డిప్యూటీ సెక్రెటరీ వనితరాణి సోమవారం ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ నెల 29తో ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఎన్నికలు నిర్వహించింది. ఐదు స్థానాలకు జనసేన, బీజేపీ అభ్యర్థులతో పాటు టీడీపీ నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 12న విత్‌డ్రాల పర్వం ముగిసింది. ఒక్కో స్థానంలో నుంచి ఒక నామినేషన్ మాత్రమే రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ధ్రువీకరణ పత్రం సోమవారం అందుకున్నారు. సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తనపై విశ్వాసంతో రెండో పర్యాయం అవకాశం ఇచ్చారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా శాసనమండలిలో తన వాణి వినిపిస్తానని తెలిపారు. డిక్లరేషన్ అందుకున్న బీటీ నాయుడు వెంట ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ అనురాధ, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, చిరంజీవి, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, అశోక్‌బాబు, దువ్వాడ రామారావు తదితరులు ఉన్నారు.

క్లస్టర్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతిగా వెంకట బసవరావు బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం క్లస్టర్ యూనివర్సిటీలోని ఉపకులపతి చాంబర్లో ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం ఉద్యోగులు అభినందించారు. ప్రస్తుతం రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా పని చేస్తున్న ఆయనకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి కోనా శశిధర్ ఇన్‌చార్జి వీసీగా కొనసాగాలని ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పని చేసిన ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ పదవీ కాలం ఈనెల 3వ తేదీతో ముగియడంతో ఆ బాధ్యతలు రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్, ప్రిన్సిపాల్స్ వీవీఎస్ కుమార్, ఇందిరా శాంతి, పాటు అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



వెంకట బసవరావుకు పూలబొకే ఇస్తున్న వర్సిటీ ఉద్యోగులు

తళుక్కుమన్న తార

సినీ హీరోయిన్ రీతు వర్మ సోమవారం ఆదోనిలో తళుక్కుమంది. ఓ వసతి దుకాణ ప్రారంభోత్సవానికి వచ్చిన రీతు వర్మ సందడి చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు, యువత ఎగబడ్డారు. అభిమానులతో హీరోయిన్ రీతు వర్మ మాట్లాడి ఉత్సాహపరిచారు. ఆదోని ప్రాంతం వ్యాపారపరంగా బాగా అభివృద్ధి చెందిందని, ఇక్కడి ప్రాంత ప్రజల అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని ఆమె ప్రసంగించారు. అభిమానుల కోరిక మేరకు రీతు వర్మ కాసేపు పాటలకు డాన్స్ చేసి డైలాగ్స్ చెప్పి యువతను ఉత్సాహపరిచారు.

– ఆదోని



వైభవోపేతం.. తెప్పోత్సవం

కోనేరులో తెప్పపై విహరించిన ప్రహ్లాద వరదుడు


అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 17(ఆంధ్రజ్యోతి) : అహోబిల లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు అనంతరం దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరద స్వామి తెప్పోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో వివిధ వాహనాల్లో విహరించి అలిసిసొలిసిన స్వామి, అమ్మవార్లు తెప్పపై కొలువై ఏకాంతంగా సేదతీరుతున్నారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పర్యవేక్షణలో ఈ తెప్పోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సోమవారం శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా కోనేటి వరకు తీసుకొచ్చారు. శ్రీవారు ఉభయదేవేరులతో తెప్పలో ఏకాంతంగా విహరించారు.



ఉభయ దేవేరులతో కలిసి తెప్పపై విహరిస్తున్న దేవదేవుడు

బెంగళూరుకు చెందిన ఆనంద్, నందిని దంపతులు ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ప్రహ్లాద వరదస్వామి తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు.

నయనానందకరం..

లక్ష్మీమాధవుల పరిణయం

- కల్యాణోత్సవానికి పోటెత్తిన భక్తులు
- గరుడ వాహనంపై ఊరేగిన ఆది దంపతులు


గరుడవాహన సేవకు హాజరైన భక్తులు

కోడుమూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం వేకువ జామున స్వామిఅమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా సాగింది. అర్ధరాత్రి ఎర్రగుడి వాసులు వరుడు మాధవుడి తరపున ప్రభను తీసుకొని హంద్రీ నది మీదుగా గోరంట్ల చేరుకున్నారు. ఆ వెంటనే వధువు లక్ష్మీదేవికి పెద్దలు గోరంట్ల వాసులతో తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం ఇరు గ్రామాల ప్రజలు ఉత్సవమూర్తులను కల్యాణకట్ట చేర్చారు. దీంతో వేదపండితుడు వందవాసి రాధాక్రిష్ణ అధ్వర్యంలో పురోహితులు మంత్రాలు పఠిస్తూ లక్ష్మీమాధవులకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవ కార్యక్రమంలో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం విద్యుద్దీపాల కాంతులతో దేదీప్యంగా ఉండడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ బాలక్రిష్ణ, టీడీపీ నాయకులు తిరుమలనాయుడు, కున్నూరు మధుసూధన్‌నాయుడు, చెరుకులపాడు దుబ్బన్న, కున్నూరు పరమేశ్వరనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఈవో గుర్రెడ్డి, పూజారులు రమణ, వెంకట్రామయ్య, రాజేష్, పురుషోత్తం, గోపి, భరత్, హరి, రంగస్వామి ఆలయ సిబ్బంది మురళి పాల్గొన్నారు.

● అవాంతరాల నడుమ గరుడ సేవ

బ్రహ్మోత్సవాల్లో స్వామిఅమ్మవార్ల కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులకు గరుడ వాహనసేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా కల్యాణమూర్తులను మేళతాళాల మధ్య ఆలయం వెలుపలికి తోడ్కొని వచ్చి గరుడ వాహనం కొలువుంచారు. అనంతరం అర్చకుల పూజలు నిర్వహించారు. గరుడ వాహనానికి ముందు భాగంలో వరుడి తరపు ఎర్రగుడి వాసులు, వెనుక భాగంలో అమ్మవారి తరపు గోరంట్ల వాసులు ఉంటారు. ముందుకు లాగే ప్రయత్నాన్ని వెనుక భాగంలో ఉన్నవారు నిలువరిస్తారు. ఈ సమయంలో ఇరువైపులా బలప్రదర్శన చూపి కేరింతలు, ఈలలతో హోరెత్తిస్తారు. గరుడ వాహన సేవలో యువకులు అధికంగా పాల్గొనడంతో ఉత్సాహం ప్రదర్శించారు. అయితే ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే వెనుక భాగంలో కట్టిన టెంకాయ తాళ్లు తెగడంతో ముందుకు దూసుకెళ్లి బ్యాలెన్స్ తప్పింది. ఘటనలో ఎర్రగుడికి ఓ వ్యక్తికి ఇరుసు చీల కోసుకోవడంతో కాలికి గాయమైంది. దీంతో వాహన సేవకు అంతరాయం ఏర్పడింది. యువకుడిని స్థానికంగా ఆసుపత్రిలో చికిత్స చేయించగా ఐదు కుట్లు పడ్డాయి. సుమారు అరగంట తర్వాత గరుడ వాహన సేవ కొనసాగింది.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


వేడుకను తిలకిస్తున్న భక్తులు


కల్యాణమూర్తులకు గరుడ వాహన సేవ

అక్కదేవతలకు 16నాళ్ల పండుగ

ఉయ్యాలవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెమ్మ గుడి వద్ద అక్కదేవతలకు 16నాళ్ల పండుగను ఘనంగా చేశారు. పూజారి ఓబులేసు ఆధ్వర్యంలో అక్కదేవతలకు పట్టు వస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు.


అక్కదేవతలకు పూజ చేస్తున్న పూజారి ఓబులేసు

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ

శ్రీశైలం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తున్న అధికారులు

కమనీయం.. రంగనాథుని కల్యాణోత్సవం

- అంగరంగ వైభవంగా రథోత్సవం


స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కమనీయంగా కళ్యాణోత్సవం జరిగింది. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు చిత్తా నక్షత్రమున రంగనాథస్వామి, భూదేవి శ్రీదేవి కళ్యాణం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగనాథ స్వామికి నూతన వస్త్రాలను దివంగత పారా రామన్న కుమారులు పారా రామచంద్ర ప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న), పారా జయవర్ధన్ సమర్పించగా.. కంసలి బ్రహ్మయ్య, మంగళసూత్రం సమర్పించగా.. పురోహితులు స్వామి, అమ్మవార్ల కళ్యాణాన్ని నిర్వహించారు. సాయంకాలం రథోత్సవం జరిపారు. ఈ ఉత్సవాన్ని తహసీల్దార్ హుశేన్‌సాబ్ టెంకాయ కొట్టి ప్రారంభించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


భక్తుల మధ్య రంగనాథ స్వామి రథోత్సవం

బాధితులకు న్యాయం చేస్తాం

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ
- ప్రజల నుంచి 115 ఫిర్యాదులు

కర్నూలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి.

- నిందితులను విచారించి బాధితులకు న్యాయం చేయాలని కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన సిద్ధయ్య ఫిర్యాదు చేశారు. కర్నూలు ఫుడ్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో కర్నూలు చెందిన జహీర్ బాషా, ఆయేషా భాను, జాకీర్ బాషా అరెస్ట్ అయ్యి.. కండీషన్ బెయిల్‌పై విడుదలయ్యారని చెప్పారు.
- తనకు తెలియకుండా తన కుమారుడు పెద్ద మద్దిలేటి, మనుమడు మధు కలిసి తన పొలాన్ని వారి పేరు మీద ఆన్‌లైన్ అడంగల్ చేసుకున్నారని, న్యాయం చేయాలని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన కె.వెంకన్న ఫిర్యాదు చేశారు.
- డీఆర్‌డీఏ వెలుగు డిపార్టుమెంటులో పని చేస్తున్న వెంకటరత్నం సీసీ స్కీముల పేరు చెప్పి ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పి, డబ్బులు తీసుకుని మోసం చేశారని హాలహర్వికి చెందిన శీలం నాగమ్మ ఫిర్యాదు చేశారు.
- అదనపు కట్నం తీసుకురావాలని అత్తమామ, బావలు వేధిస్తున్నారని పత్తికొండ పట్టణానికి చెందిన వి.రమాదేవి ఫిర్యాదు చేశారు.
- పెంచికలపాడు దగ్గర ఉన్న తమ పెద్దల స్థలానికి తన సోదరుడు అనిల్ కుమార్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రాజశేఖర్‌పై రిజిస్ట్రేషన్ చేశారని, సహకరించిన ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలని కర్నూలు విఠల్‌నగర్‌కు చెందిన రేణుక ఫిర్యాదు చేశారు.
- చీటీ డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న జోహరాపురం గ్రామానికి చెందిన మహమ్మద్‌పై చర్యలు తీసుకోవాలని కర్నూలు ఇందిరమ్మ గృహాల ఏరియాకు చెందిన చాకలి రామచంద్రుడు ఫిర్యాదు చేశారు.
- మాదేవి కుటుంబ సభ్యులు డ్రైనేజీ కాలువలో నీటి పోయకూడదని కాలువలో మట్టి, రాల్లు వేసి ఇంటి దగ్గర గొడవ చేశారని, పొలానికి వెళ్లేటప్పుడు దారి లేదని దాడి చేస్తున్నారని క్రిష్ణగిరి మండలం కటారికొండ గ్రామానికి చెందిన సరోజ ఫిర్యాదు చేశారు.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

కర్నూలు లీగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు తమ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకొని సత్వర న్యాయం పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది తెలిపారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాల న్యాయవాదులకు, ఎన్జీవోలకు నిర్వహించిన మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర హైకోర్టు అన్ని జిల్లా కోర్టులలో మధ్యవర్తిత్వాన్ని ప్రవేశపెట్టాలని ఆదేశించిందని, ఈ మేరకు సోమవారం నుంచి 21వ తేదీ వరకు ఈ అంశంపై 40 గంటల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అవగాహన కల్పించేందుకు కేరళ రాష్ట్రం నుంచి శిక్షకులు వచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 89 కింద మధ్యవర్తిత్వానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు.

నేడు గ్రేడ్-3 ఏఎన్ఎంలకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో 175 ఖాళీలకు ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఎంపీహెచ్ఏ (ఫీమేల్)గా పదోన్నతుల కౌన్సెలింగ్ మంగళవారం ఉదయం 11.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ ఓ ప్రకటనలో తెలిపారు. పదోన్నతులు అడిక్వెసీ చూసుకుని రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం చేసినట్లు తెలిపారు. వెయిటేజ్ మార్కులు కలిపేది డీఎంహెచ్‌వో పరిధిలో ఉండదని, మెరిట్ లిస్టు స్టేట్ నుంచి వస్తుందని, వెయిటేజీ మార్కులు మూడు విడతల్లో పంపినట్లు తెలిపారు. వెయిటేజీ మార్కులు కలవని, ఏఎన్ఎం-2019లోనే స్టేట్‌కి సర్వీసు సర్టిఫికేట్‌ని పెట్టుకున్నారని, అప్పుడు మార్కులను కలిపి రివైజ్డ్ మెరిట్ లిస్టు వచ్చినట్లు చెప్పారు. అర్హుల జాబితా, ఖాళీల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు సర్వీసు రిజిస్టరర్, ప్రయారిటీ సర్టిఫికెట్లు తీసుకురావాలని చెప్పారు.

'కొన్ని ఖాళీలను తగ్గించారు'

ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల ఖాళీలను 215 నుంచి 175 తగ్గించారని, దీని వల్ల ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు. పదోన్నతుల కౌన్సిలింగ్ కమిటీలో కలెక్టర్ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. రోస్టర్‌కు సంబంధించిన ఎస్సీ కేటగిరీకి రావాల్సిన పోస్టులు తక్కువ చూపించాలని కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై వైద్యఆరోగ్య శాఖ అధికారులు మాత్రం ప్రొజిషియన్ ఐడీ లేనందువల్ల కొన్ని పెండింగ్‌లో పెట్టామని, ఎస్సీ లు ఉన్నదానికంటే ఎక్కువగా ఉండటం వల్ల జనరల్ సీనియారిటీ ప్రకారం జనరల్ కేటగిరి ప్రకారం పదోన్నతులు కల్పిస్తామన్నారు. ఇక్కడ ఎవరికీ అన్యాయం జరగదని, పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు.

రాక్షసుడిని రాష్ట్రంలోకి రానివ్వకండి

- సాక్షులను హత్య చేస్తున్న అవినాష్
- టీడీపీ నాయకులను చంపిస్తున్న పెద్దిరెడ్డి
- కుడా చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లిని కూడా ఇంటి నుంచి గెంటి వేసి కేసులు పెట్టిన జగన్మోహన్ రెడ్డి లాంటి రాక్షసుడిని రాష్ట్రంలోకి రానివ్వకండని ప్రజలను కుడా చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్ రాష్ట్రంలోని వనరుల ద్వారా వేల కోట్ల రూపాయలు దోచేశారని ఆరోపించారు. బాబాయి వివేకానంద రెడ్డిని చంపిన అవినాష్‌రెడ్డి అరెస్టు కాకుండా కాపాడుతున్న జగన్‌కు సిగ్గు ఉందా? అని ప్రశ్నించారు. మరో వైపు చిత్తూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలను అతికిరాతకంగా చంపిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంటనే అరెస్టు చేసి జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్రంలోని అటవీ భూములను కబ్జా చేసికోట్లు గడించారని, అడ్డువచ్చిన తెలుగుదేశం పార్టీ వారిని హత్యలు చేయిస్తున్నారని మండిపడ్డారు. పోలీసు యంత్రాంగం అంటే భయపడేలా వైసీపీ నాయకులకు చేస్తే తప్ప టీడీపీ నాయకులు, కార్యకర్తలను చిత్తూరు జిల్లాలో కాపాడుకోలేని పరిస్థితి ఉందన్నారు.

ఆదోనిలో చందన షాపింగ్ మాల్ ప్రారంభం

- హాజరైన సినీ నటి రీతు వర్మ


షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ తదితరులు

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో చందన షాపింగ్ మాల్‌ను సినీ నటి రీతువర్మ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్పీ హేమలత, టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ శాంత హాజరయ్యారు. ముందుగా రీతువర్మ చందన బ్రదర్స్ షోరూంకు రాగానే యువకులు కేరింతలు కొట్టారు. అనంతరం షోరూంలో ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు. షాపింగ్ మాల్‌లో బంగారు ఆభరణాలు ధరించారు. ఈ సందర్భంగా రీతు వర్మ విలేకరులతో మాట్లాడుతూ ఆదోనిలో ఇంత పెద్ద షాపింగ్ మాల్‌కి తాను ముఖ్యఅతిథిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ వినియోగదారులకు 99 రూపాయల నుండే వస్త్రాలు దొరుకుతాయన్నారు. ఆకర్షణీయంగా సరికొత్త డిజైన్లతో జ్యూవెలరీ లభ్యమవుతుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు వన్ టౌన్ సీఐ శ్రీరాం, ట్రాఫిక్ సీఐ గంట సుబ్బారావు ప్రత్యేక చొరవ తీసుకుని తమ సిబ్బందితో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.


సినీ తారను చూసేందుకు వచ్చిన జనం

దద్దనాల ప్రాజెక్టుకు గండి

ఎత్తిపోతల ద్వారా ఆపివేసిన పంపింగ్

అక్రమ మైనింగ్‌ను పట్టించుకోని అధికారులు



ప్రాజెక్టు ఎత్తిపోతల పథకానికి గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని జోలాపురం గ్రామం వద్ద సుద్దను కొందరు అక్రమార్కులు అక్రమంగా తవ్వుతుండడంతో దద్దనాల ఎత్తిపోతల పథకానికి సంబంధించి పైప్‌లైన్‌కు సోమవారం గండి పడింది. దీంతో వృథాగా నీరు పోవడంతో దద్దనాల ఎత్తిపోతల పథకం పంపింగ్ ఆపివేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఎంతో సదుద్దేశంతో సొంత నిధులు రూ.25.75 లక్షలు సొంత నిధులు వెచ్చించి ఎత్తిపోతల పథకానికి సంబంధించి పంపింగ్ కేంద్రంలో ఉన్న తుప్పుపట్టిన నాలుగు పంపింగ్ మోటార్లకు ఈ మధ్యనే మరమ్మతు చేయించి శివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ ఎస్సార్బీసీ నీటిని ఎత్తిపోతల పథకం పంపింగ్ కేంద్రం నుంచి దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. దీంతో సజావుగా పంపింగ్ చేస్తుండడంతో దద్దనాల ప్రాజెక్టుకు 12 అడుగుల వరకు నీరు చేరింది. అయితే అక్రమ మైనింగ్ వల్ల ఒక్కసారిగా పైప్‌లైన్‌కు గండి పడడంతో పంపింగ్ పనులు ఆపివేశారు. దీంతో దద్దనాలకు ఎత్తిపోతల ద్వారా నీరు నిలిచిపోయింది.

దద్దనాల ప్రాజెక్టుకు నీరు విడుదల: రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మలు ఈనెల 26తేదీన బనగానపల్లె పట్టణ సమీపంలోని దద్దనాల ఎత్తిపోతల పథకం ద్వారా మోటార్‌లుఆన్ చేసి ఎస్సార్బీసీనీటిని జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి పడమటిపల్లెలకు అంకితం చేశారు. ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఉండడంతో మంత్రి బీసీ సొంత నిధులు 25.75లక్షలు వెచ్చించి గత వైసీపీ ప్రభుత్వంలో తుప్పుపట్టిపోయి, పాడై పోయి మూలన పడ్డ నాలుగు మోటార్లుకు 40రోజులు మరమత్తులు చేయించి ఎస్సార్బీసీ కాల్వ ద్వారా ఏర్పాటు చేసిన జుర్రేరు ఎత్తిపోతల పథకం ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నాలుగు మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేసి ఎన్నికల్లో మంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జుర్రేరు ఎత్తిపోతల పంప్‌హౌస్ వద్ద విలేఖర్లతో మాట్లాడుతూ పడమటి పల్లెలు అయిన సుమారు 28 గ్రామాలకు సాగు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.21 కోట్లతో జుర్రేరు ఎత్తిపోతల పథకాన్ని బీసీ జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పూర్తి చేశారు. చేయడం జరిగింది .

యథేచ్ఛగా అక్రమ మైనింగ్

మండలంలోని జోలాపురం పరిసర ప్రాంతాల్లో ఓ వైసీపీ నాయకుడు గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నారు. సుద్దను ఎక్స్‌కవేటర్ బ్లాస్టింగ్‌ల ద్వారా సుద్దను తవ్వి దాన్ని మద్రాస్ తదతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ సుద్దను సబ్బులు, పౌడర్లకు వినియోగిస్తుంటారు. టన్ను సుమారు టన్ను 3వేల రూపాయల చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో కూడా కూడా అక్రమ మైనింగ్ చేసి సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇది ఆగలేదు. గతంలో కూడా అక్రమ మైనింగ్ చేస్తుండడంతో దద్దనాల ఎత్తిపోతల పథకానికి గండి పడింది. బీసీ జనార్దన్‌రెడ్డి అప్పట్లో అక్రమ మైనింగ్ తవ్వక



జోలాపురం వద్ద అక్రమంగా జరుగుతున్న మైనింగ్

ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. టీడీపీ ప్రభుత్వంలో కూడా అక్రమ మైనింగ్ ఆగలేదు. అక్రమ మైనింగ్‌తో గండిపడ్డ ఎత్తిపోతల పథకం: ఎంతో సక్రమంగా సాగుతున్న ఎత్తిపోతల పథకానికి జోలాపురంలో అక్రమ మైనింగ్ కొనసాగుతుండడంతో ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు గండి పడి పోయింది. దీంతో నీరు వృథాగా పోయింది. దీంతో ఎత్తిపోతల పథకం పంపింగ్ నిలిచిపోయింది. అక్రమ మైనింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పడమటి ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అక్రమమైనింగ్ జరుగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

గండి పడింది పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

- ఐడీసీ నారాయణరెడ్డి ఏఈ

దద్దనాల ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు గండి పడింది. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఎత్తిపోతల పంపింగ్ పనులు నిలిచిపోయాయి. పైప్‌లైన్ గండి పడడానికి కారకులపై చర్యలు తీసుకుంటాం.

ఉపాధి పనుల్లో భారీ అవినీతి

- చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో భారీ అవినీతి జరిగిందని, వైసీపీ కార్యకర్తలే ఉపాధి కూలీలుగా మారి దోచుకున్నంత దోచేశారని సోమవారం ఎమ్మెల్యే పార్థసారథి అసెంబ్లీలో గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో గత ప్రభుత్వ పాలనలో ఉపాధి పనులలో జరిగిన అవినీతిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు ఫీల్డ్ అసిస్టెంట్‌గా మారి ఆదాయ వనరులుగా మార్చుకున్నారని అసెంబ్లీలో అన్నారు. ఎక్కడా కూలీలతో పని చేయించకుండా ఎక్స్‌కవేటర్లతో పనులు చేయించి డబ్బులు కాజేశారని అన్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టి అవకతవకలు గుర్తిస్తున్నామన్నారు. 526 మండలాల్లో సోషల్ ఆడిట్ జరిగిందని, 2024-25లో రూ.250 కోట్లు అవినీతి జరిగిందని అన్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో తనిఖీలు

- విధుల్లో లేని ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మెమో జారీ



జనరల్ సర్జరీ ఓపీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం ఓపీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాల్టీ, సైక్రియాట్రి సెంటర్, మెడికల్, సర్జరీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ ఓపీ విభాగాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాజువాల్టీలో ఉదయం 9.45 గంటలైనా ఎమర్జెన్సీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సర్జరీ ఓపీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విధుల్లో లేకపోవడంపై సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మెమో జారీ చేసి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగాల్లో ఈ హాస్పిటల్ అమలుపై ఆరా తీశారు. రోగులకు ఎంట్రీ పాస్‌ల గురించి చర్చిస్తున్నామని, త్వరలో అమలయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ హాస్పిటల్ నమోదును పకడ్బందీగా అమలు అయ్యేటట్లు చూడాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో రోగుల రద్దీ దృష్ట్యా అదనంగా మరొక ఓపీ కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తనిఖీలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల, డా.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

హైబీపీతో ఉపాధ్యాయురాలు మృతి

కోసిగి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 4వ వార్డులో ఉన్న ఎంపీపీ సీజీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయిని కవిత హైబీపీతో మృతి చెందారు. ఆమె ప్రస్తుతం 8నెలల గర్భిణి. ఆదివారం రాత్రి పురిటినొప్పులు రావడంతో సొంత గ్రామమైన పాములపాడు సమీపంలోని బుక్కపల్లి గ్రామం నుంచి ఆత్మకూరుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ హైబీపీతో మృతి చెందినట్లు సీజీ పాఠశాల హెచ్‌ఎం సుబ్బలక్ష్మి తెలిపారు. ఎంఈవోలు మొయినుద్దీన్, శోభారాణి మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన ఉపాధ్యాయిని కవిత మెటర్నిటీ లీవ్ తీసుకున్నారని చెప్పారు. ఉపాధ్యాయిని మృతి చెందడం బాధాకరమని ఏపీటీఎఫ్ నాయకులు యూనియన్ నాయకులు ఖలీల్ అహ్మద్; రాజమౌలి, రాముడు, ఓబులేసు వెంకటరెడ్డి, తోటి ఉపాధ్యాయులు నరసయ్య, విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

ఏరియా వైద్యశాలకు నిధులు కేటాయించండి

అసెంబ్లీలో మంత్రి బీసీ విజ్ఞప్తి



బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు నిధులు కేటాయించాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం శాసనసభలో ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌ను కోరారు. సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కనీస మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని ఆరోగ్యమంత్రిని బీసీ కోరారు. బనగానపల్లె నియోజకవర్గంలో ప్రభుత్వాస్పత్రులకు నిధులు కేటాయించాలని ఆరోగ్య శాఖామంత్రి దృష్టికి తీసుకుపోయారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం బనగానపల్లె వైద్యశాలకు త్వరిత గతిన నిధులు కేటాయించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆరోగ్య శాఖ మంత్రిని మంత్రి బీసీ కోరారు.

శరీన్‌నగర్‌లో ముమ్మర తనిఖీలు

కర్నూలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శరీన్‌నగర్‌లో సోమవారం రాత్రి పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. సంజన్న హత్య కేసు ఘటన తర్వాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌ఐలు గోపినాథ్, చంద్రశేఖర్ రెడ్డి, ఏఆర్ పార్టీ పోలీసులు ఈ తనిఖీలు చేశారు. పార్కులు, బహిరంగ స్థలాలు, పాఠశాలలు, పార్కుల వద్ద పనిపాట లేకుండా తిరుగుతున్న వారిని హెచ్చరించారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

సంజామల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆకుమళ్ల టీడీపీ వర్గీయులు అదే వర్గానికి చెందిన మహేశ్వర రెడ్డి, రమణారెడ్డిపై దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య సోమవారం తెలిపారు. గ్రామ ఆధిపత్యం కోసం వర్గ విబేధాలతో గొడవలకు పాల్పడి ప్రత్యర్థులను గాయాలకు గురి చేసిన తిమ్మయ్య, దుబ్బా రామగోవింద రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మదన గోపాల్, కుళ్లాయిరెడ్డిలను అరెస్ట్ చేసి కోవెలకుంట్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచామన్నారు. రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వలస వెళ్లిన రైతు ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసి అప్పుల పాలై కుటుంబంతో వలస వెళ్లి జీవిస్తున్న రైతు లక్ష్మన్న (32) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జొన్నగిరికి చెందిన సూరన్న కుమారుడు లక్ష్మన్న, భార్య పిల్లలతో రైల్వేకోడూరుకు వలస వెళ్లి బేల్దార్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దొంగల నుంచి కాపాడండి

పోలీసులకు గోవర్దనగిరి మామిడి రైతుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

వెల్దుర్తి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మామిడి పొలాల్లో దొంగలు పడి కాయలను దోచుకెళ్తున్నారని గోవర్దనగిరి రైతులు కోరారు. సోమవారం మామిడి రైతులు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసు అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నారు. గోవర్దనగిరి గ్రామం చుట్టూ వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. గత నెల నుంచి మామిడికాయలు ఒక సైజుకు వచ్చాయి. కొందరు దుండగులు రాత్రి వేళల్లో బైకులపై గ్రామ శివారులోని పొలాలకు చేరుకుని మామిడికాయలను కోసుకుని వెళ్తున్నారు. నెల రోజులుగా గ్రామానికి చెందిన మద్దయ్య, నక్క రాముడు, శివుడు, అయ్యస్వామి రైతుల తోటల్లో ఈ దొంగతనాలు జరిగాయన్నారు. గత రాత్రి రామచంద్రుడు అనే రైతు పొలంలో దొంగలు మామిడి కాయలు కోసుకుని పరారవుతుండటం రైతు గమనించాడు. రామచంద్రుడు వారి వెంట పడి కేకలు వేయగా.. సమీపంలోని వంకలో మామిడి సంచులను వేసి దొంగలు పరారయ్యాడు. దీంతో రైతులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల నిరసన

కర్నూలు హాస్పిటల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగులు నిరసన బాట పట్టారు. సోమవారం కర్నూలు, నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 180 మంది వైద్యమిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు సీసీడీఈవో విధులు బహిష్కరించారు. అనంతరం కలెక్ట రేట్ ఎదుట ఎన్టీఆర్ వైద్యమిత్ర అండ్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ యూని యన్ (జేఏసీ) ఆధ్వర్యంలో శాంతియుత దశలవారి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నాగరాజు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు కంబగిరి, మనోహర్ మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా చాలీ చాలని వేతనాలతో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలని, రిటైర్ మెంటు బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషా, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్ర టరీ దేవేంద్ర నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మహ్మద్‌గౌస్, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు రవి, సభ్యులు ఇందిర శరణ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వైద్యమిత్ర ఉద్యోగులు

మృతదేహంతో బంధువుల ఆందోళన

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం నాగలాపురం గ్రామస్థులు వీరేష్ (30) మృతదేహంతో ఆందోళన చేపట్టారు. 2025 మార్చి 13వ తేదీన ఆదోని సమీపంలో ట్రాక్టర్, కారు ఢీకొన్న ప్రమాదంలో కురువ వీరేష్ (30) తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. వీరేష్‌కు భార్య సుజాతతో పాటు ఐదుగురు ఆడబిడ్డలు ఉన్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. ఇంటికి పెద్ద దిక్కున కోల్పోవడంతో ఆ ఇంటిల్లిపాది బతికేది కష్టమని, అలాంటి సమయంలో పిల్లలకు ఏదైనా సహాయం అందించాలంటూ వీరేష్ శవంతో గ్రామస్థులు స్థానిక విముల రేజెన్సీ దగ్గర ఆందోళన చేపట్టారు. అనంతరం నిర్వాహకులు వేముల రెడ్డి వారు కుటుంబ సభ్యులకు ఆర్థికంగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



మృతదేహంతో ఆందోళన చేస్తున్న దృశ్యం

పొగాకు బేళ్లు దగ్ధం : రూ.1.50 లక్షల ఆస్తి నష్టం



కాపులపల్లెలో పొగాకు బేళ్లు దగ్ధమైన దృశ్యం

బనగానపల్లె, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం కాపులపల్లె గ్రామానికి చెందిన నెమలి వెంకట కృష్ణయ్యకు చెందిన పొగాకు బేళ్లు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. ఎవరూలేని సమయంలో మంటలు చెలరేగడంతో గమనించిన గ్రామ ప్రజలు సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వ నీటితో బిందెల ద్వారా మంటలను ఆర్పివేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. గ్రామ సర్పంచ్ తులసిరెడ్డి ప్రమాద ఘటనా స్థలానికి చేరుకొని బాధితున్ని పరామర్శించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. బాధితుడు నెమలి వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ తాను కౌలుకు పొలం తీసుకొని పొగాకు పండించడం జరిగిందన్నారు. కక్ష్యపూరితంగానే పొగాకుకు నిప్పంటించాడని బాధితుడు వాపోయాడు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. బాధితుడు వెంకటకృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జొన్నగిరిలో గడ్డివాముకు నిప్పు

తుగ్గలి: గడ్డివాము మంటలకు దగ్ధం కావడంతో రూ.1లక్ష నష్టం వాటిల్లింది. ఆదివారం రాత్రి మండలం చిన్న జొన్నగిరిలో వడ్డె తిరుమలేష్ చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలకు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది పత్తికొండ నుంచి వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అప్పటికే గడ్డివాము అంతా దగ్ధమైంది. సర్పంచ్ ఓబులేసు, టీడీపీ నాయకులు రవి యాదవ్, లక్ష్మణ స్వామి, కృష్ణ, బలరాముడు, మల్లి దగ్ధమైన గడ్డివామును పరిశీలించి రైతులను ఓదార్చారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

అత్యాచార నిందితుడికి జీవిత ఖైదు

కర్నూలు లీగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళను అత్యాచారం చేసిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు మహిళా కోర్టు న్యాయాధికారి వి. లక్ష్మీరాజ్యం సోమవారం తీర్పు చెప్పారు. 2020 డిసెంబరు 5వ తేదీన బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన కోసిగి గ్రామానికి చెందిన బాధితురాలు తన అన్న ఆరోగ్యం బాగా లేకపోవడంతో సంజామల మండలం పేరుసోముల గ్రామ సమీపంలో చికిత్స ఇప్పించేందుకు వెళ్లింది. 2020 డిసెంబరు 3వ తేదీన అక్కడ బాధితురాలు నిద్రిస్తుండగా.. తన అన్న కనపడకపోవడంతో వెతకడానికి వెళ్లింది. పేరుసోముల గ్రామం చౌడేశ్వరి గుడి సమీపంలో బాధితురాలు వెళ్తుండగా.. మోటారు సైకిల్‌పై వచ్చిన నిందితుడు హరిక్రిష్ణ మీ అన్నను దగ్గరలో చూశానని, మాయమాటలు చెప్పి ఆ మహిళను తన వాహనంలో ఎక్కించు కుని వెళ్లి అత్యాచారం చేశాడు. తాను పోలీసులనని, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తుపాకితో కాల్చివేస్తానని బెదిరించాడు. ఈ విషయం మీద కొడుకుతో కలిసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడు నాగహరిక్రిష్ణపై కేసు నమోదు చేసి కర్నూలు ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధితురాలికి నష్టపరిహారాన్ని చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను న్యాయాధికారి ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ ఎస్. నరేంద్రనాథ్ రెడ్డి వాదించారు.



నిందితుడిని జైలుకు తీసుకెళ్తున్న పోలీస్

పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు



పది పరీక్షా కేంద్రం వద్ద పోలీసులు

కర్నూలు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన పది పరీక్షా కేంద్రాల వద్ద ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు బందోబస్తు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పోలీసు బృందాలచే పరీక్ష కేంద్రాల వద్ద పెట్రోలింగ్ చేపట్టారు. పరీక్షలలో పాల్గొనే విద్యార్థులు, పరీక్షల నిర్వహణ ఆయా పాఠశాల సిబ్బంది మినహా ఎవరిని ఆ పరిసరాల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాలోకి వెళ్లే విద్యార్థులు ఎలాంటి సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా తనిఖీలు చేశారు. పరీక్షలు సజావుగా జరగడానికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పోలీసు శాఖ తరపున కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

కల్లూరు: కల్లూరు మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం 18 కేంద్రాల్లో చేపట్టిన పరీక్షలకు మొత్తం 3798 మంది విద్యార్థులకు గాను 3774 మంది పరిక్షలు హాజరయ్యారని, 24 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈఓ జి.వనజ తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కేసులు లేవని ఎంఈఓ తెలిపారు.

గూడూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం గూడూరు పట్టణం లోని జడ్పీ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రంలో రెగ్యులర్ విద్యార్థులు 145మంది హాజరయ్యారు. అలాగే ప్రైవేటు ఏడుగురు విద్యార్థులలో ఆరుగురు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలురు పాఠశాల పరీక్షా కేంద్రంలో రెగ్యులర్ 157 మంది విద్యార్థులు గానూ 156 మంది హాజరయ్యారు. ఏపీ మోడల్‌స్కూల్ జులకల్ పాఠశాలలో రెగ్యులర్ 161 మంది విద్యార్థులుకు కాగ 159 మంది హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ తెలిపారు.

సి.బెళగల్: మండలంలోని పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అయితే 12 మంది విద్యార్థులు అనివార్య కారణాల తో పరీక్షకుహాజరు కాలేదని ఎంఈవో జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పది పరిక్ష కేంద్రంలో పాము హల్‌చల్ చేయడంతో విద్యార్థులు భయాందోళన చెందారు. తర్వాత పాము బయటకు వెళ్లిపోవడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

నూతన తహసీల్దార్ భవనం నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నగర అభివృద్ధి కమిటీ సభ్యులు

గూడూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతన తహసీల్దార్ భవనాన్ని నిర్మించాలని గూడూరు నగర అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. నగర అభివృద్ధి కమిటీ కన్వీనర్ పైగేరి నాగరత్న రావు ఆధ్వర్యంలో సభ్యులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరకుందని, అధికారులు విధులు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ సభ్యులు దండు సుందర్‌రాజు, సుధాకర్, రామాంజనేయులు, టీఎస్ రాజు, భాస్కర్, మనోహర్ పాల్గొన్నారు.

బైండోవర్ చేస్తాం: సీఐ



మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పోలీసు సర్కిల్ పరిధిలో ఎవరైన జన్మదిన వేడుకలు రోడ్లపై చేసుకుంటే బైండోవర్ చేస్తామని సీఐ తబ్రేజ్ హెచ్చరించారు. సర్కిల్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కోడుమూరు, గూడూరు స్టేషన్ పరిధిలో కొంత మంది యువకులు జన్మదిన వేడుకలని రోడ్లపైకి వచ్చి తల్వార్, కత్తులు చేత పట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అంతేకాకుండా అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టారన్నారు. ఇలా చేయడం తప్పుగా భావించి కోడుమూరులో ఐదుగురు, గూడూరులో ఒకరిపై బైండోవర్ చేస్తామని చెప్పారు. అలాగే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్ బ్యాక్ సర్వేపై అవగాహన

కర్నూలు న్యూసిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్ బ్యాక్ సర్వేపై సోమవారం మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో న్యూ కౌన్సిల్ హాలులో మెప్మా రిసోర్స్ పర్సన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో వచ్చే చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేసి అందించాలన్నారు. అడిషినల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, టీఎంసీలు సుధాకర్, విజయభారతి, సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు గత సబ్ రిజిస్ట్రార్ రాందాస్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నీలావతి, శ్రీరామ్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 135/2 ప్లాట్ నెంబరు.68ను 2017లో ఒకరికి, 2023లో మరొకరికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ రాందాసు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. చెల్లని ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్ట్రార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలన్నారు. ఆయనపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు కూడా ఫిర్యాదు చేశామని వారు పేర్కొన్నారు.

● ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, హోళగుంద ప్రాంతాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకుల రాజు, జాతీయ లంబాడీ సంఘం రాష్ట్ర సమన్వయకర్త ఆర్ యోగేష్ నాయక్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాం తాల్లో పదివేల మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబ డటంతో వారు బళ్లారి, గుంటూరు, హైదరాబాదు, ముంబై, కలకత్తా దూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కాబట్టి వారి చదువులకు ఆటంకం కలగకుండా ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.

● జర్నలిస్టులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించాలని విలేకరులు మీసాల రామస్వామి, కందనవోలు శ్రీను, హరికృష్ణ, రమేష్ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అనారోగ్యంతో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం, మూడు సెంట్లు స్థలం, మృతి చెందిన కుటుంబాలకు భద్రత కల్పించా లని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

● ఆలూరు నియోజకవర్గం మరకట్ట గ్రామంలోని దళితవాడలో గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని జిల్లా మాల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు దామోదరం రాధాకృష్ణ, జైభీమ్ సాయిరాం, కసాపురం వెంకటేశ్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, మాధవస్వామి, మునయ్య, కేశవ్, మల్లికార్జున పాల్గొన్నారు.

● మా ధాన్యం మాకు ఇప్పించాలని చిప్పగిరి మండలం మల్లేనిపల్లి, డోనేకల్లు గ్రామాల్లోని రైతులు వై.ప్రసాద్, చంద్రప్ప అనే రైతులు కలెక్టర్‌ను కోరారు. మేము పండించిన శనగ, జొన్న పంటలు చిప్పగిరిలోని మారుతి ఫార్మ్‌వేర్ హౌస్ గోడౌన్‌లో నిల్వ ఉంచుకున్నామని, కానీ ఆర్య కోల్లేటర్ వేర్ హౌసింగ్ సర్వీసు ప్రైవేటు లిమిటెడ్ వారు సబ్ లీజుకు తీసుకున్నారని తెలిసింది. మా ధాన్యాన్ని తీసుకుని వెళ్లడానికి వెళ్లగా లోన్ ఉందంటూ మా ధాన్యం మాకు ఇవ్వడం లేదన్నారు.

● బీఆర్ఎస్ రెడ్డి కాలనీలో మురుగు కాలువకు అడ్డంగా గోడ నిర్మిం చడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుందని పట్టణ పౌర సంక్షేమ సంఘం కర్నూలు సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, కే.మధుసూదన్, ఎస్.షరీఫ్ బాషా, పి.రాజశేఖర్ అన్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామ నివాసి లింగమయ్య నాకు సర్వే.నెంబరు.29లో రెండెకరాల పొలం ఉంది. ఈ భూమికి అడంగల్ కూ డా ఉంది. కానీ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రాధాన్యత క్రమంలో వసతుల కల్పన

కమిషనర్ రవీంద్రబాబు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ కాలనీల్లో మౌలిక వసతులను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

సి.బెళగల్: తుంగభద్ర నది నీటిని తెలంగాణ వారు వ్యవసాయానికి వినియోగించకుండా అరికట్టాలని నదితీరా గ్రామాల సర్పంచులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడాది తుంగభద్ర నది ఎండిపోయి ఎడారిగా మారడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే ఈసంవత్సరం ప్రభుత్వం తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా నదికి నీరు విడుదల చేసిందన్నారు. అయితే ఆ నీటిని తెలంగాణ ప్రాంతమైన తుమ్మిళ్ళ గ్రామ రైతుల వ్యవసాయానికి వినయోగించుకోవడంతో నదిలో నీరంతా ఖాళీ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఎం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు రూరల్ మార్చి 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్ఏ సుభాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేశారు. ఈసందర్భంగా సుభాన్ మాట్లాడుతూ నగరంలో చాలా ప్రాంతాల్లో నిరుపేద ప్రజలు ఉన్నారని, వారంతా చేతివృత్తి, తోపుడు బండ్ల వ్యాపారం చేసుకొని జీవిస్తున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు పేదలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమన్నారు. వెంటనే వాటిని అమలు చేయాలని సుభాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు షరీఫ్, రాజశేఖర్, మహబూబ్ బాషా, జావేద్, రియాజ్, రఫీక్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

చెరువుకు నీరు విడుదల చేయాలి

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగులాపురం చెరువుతోపాటు ఆయా గ్రామాల్లోని తాగునీటి కుంటలకు నీరు విడుదల చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ కోరారు. సోమవారం సురేష్ ఆధ్వర్యంలో రైతులు ఇరిగేషన్ ఈఈ పాండురంగయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కె.నాగులాపురం, గూడూరు చెరువులతో పాటు ఆర్.కానాపురం, గుడిపాడు గ్రామాలకు చెందిన కుంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు విన్నవించామన్నారు. ధర్మారెడ్డి, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులా రాణి పిలుపునిచ్చారు. సోమవారం సల్కాపురం సర్పంచు బి.మద్దిలేటి అధ్యక్షతన మెడికల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అన్నపూర్ణా ఆధ్వర్యంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 17 నుంచి 23వ తేదీ వరకు డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సహకారంతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు సర్వే చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకుడు దేవేంద్రారెడ్డి, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం లైసెన్సు రద్దు చేయండి

కర్నూలు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రేణుకా ఎల్లమ్మ మద్యం దుకాణం లైసెన్స్ రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు మండలంలో పెద్దటేకూరు గ్రామం సమీపంలో జాతీయ రహదారిలో మూడు ఎక రాల స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, పొలాల్లో విచ్చలవిడిగా మద్యం తాగేందుకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. పుల్లన్న, దొడ్డిపాడు మహమ్మద్‌బాషా, శ్రీని వాసరావు పాల్గొన్నారు.

సెట్కూరు సీఈవోను కలిసిన నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 17: కల్లూరు ఎస్టేట్‌లోని సెట్కూరు కార్యాలయంలో సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఈవో వేణుగోపాల్‌కు రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ కలిసి భక్తకనకదాసు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పాల సుంకన్న, హరిదాసు, కేసీ నాగన్న, బి.వెంకటేశ్వర్లు, పుల్లన్న, బీసీ తిరుపాలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18: చిన్న వయస్సులోనే విద్యార్థులతో వ్యాపార నైపుణ్యాలు నేర్పిస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి మరో పది మందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదుగుతారని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల ప్రతినిధి ఎం.గీతాశ్రీ అన్నారు. సోమవారం నగర శివారులోని పడిదెంపాడు రోడ్డులోని రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో చిన్న వ్యాపారుల ప్రోత్సాహక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎం.గీ తాశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలు గుర్తించి వారిని సరైన మార్గంలో నడిపితే భవిష్యత్తులో వారి జీవితం ఆనందకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రవీంద్ర గ్లోబల్ స్కూల్ చైర్మన్ జీ.వంశీధర్, సీఈవో సుప్రియ, ప్రిన్సిపాల్ ముంతాజ్‌బేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి

కల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): 32వ వార్డు ముజఫర్‌నగర్‌లోని హంద్రీ నది వెంట డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కార్య దర్శివర్గ సభ్యులు సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవా రం సీపీఎం ఆధ్వర్యంలో కాలనీలో ప్రజా చైతన్యయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ ఆనంద్, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● 29వ వార్డు ఉద్యోగనగర్, వాసు నగర్, శారదనగర్, అన్నయ్య నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు జి.ఏసు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్యయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

కౌలు రైతులకు సమగ్ర చట్టం చేయాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కైలు రైతుల సంక్షేమం కోసం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్య దర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 80శాతం మంది భూములను కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి వారికి ప్రభుత్వ నుంచి ఎలాంటి సహకారం అందడంలేదన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకులలో పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పంపన్న గౌడు, తిమ్మయ్య, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సీపీఐ నగర కార్య దర్శి రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న స్కావెంజర్స్‌కు పెండింగ్ జీతాలు చెల్లించాలని ఏపీ ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఆయాలు, స్కావెంజర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ స్కావెంజర్స్‌కు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.10వేల వేతనం ఇవ్వాలన్నారు. మెడికల్ లీవ్‌లు ఇవ్వడంతోపాటు ఆయాలకు ఇత ర ఆఫీసులకు డ్యూటీలు వేయడం మానుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేఖ, బి.స్వర్ణ, సునీత, మహేశ్వరి, నాగమణి, మేరి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

● జోహరాపురం పరిధిలోని రెవెన్యూ వక్ఫ్‌బోర్డు భూమిలో పేద ముస్లింలకు 2 సెంట్ల స్థలం కేటాయించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ఇన్సాఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోహరాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో 154 సర్వే నెంబరులో వక్ఫ్‌బోర్డు భూమి 12 ఎకరాల 49 సెంట్లు ఉందన్నారు .ఇప్పటికే 6 ఎకరాలు కబ్జాకు గురైందన్నారు. మిగిలిన 6 ఎకరాలను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేసి ప్లాట్లు వేసుకోవాలని చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇన్సాఫ్ నాయకుడు అన్వర్ సీపీఐ నగర సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావు, శ్రావణిరెడ్డి, నాగేంద్రమ్మ, భారతి, ఆశాబేగం పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి ఆర్చరి పోటీల్లో క్రీడాకారులు రాణించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం ఆర్చరీ క్రీడాకా రులు, జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య ఆధ్వర్యంలో ఎస్పీని కలిశారు. జిల్లాకు పార్థ చంద్ర, కియానా, నేహాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కార్యదర్శి నాగరత్నమయ్య తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ క్రీడాకారులను అభినందించారు.

సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బిర్లా కూడలిలో సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ లక్ష్మీకాం తయ్య అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిర్లా కూడలిలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం పక్కన సావిత్రిబాయి పూలే విగ్రహం కూడా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు దేవపూజ ధనుంజయ ఆచారి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కర్నూలు రూరల్ మార్చి 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల నాయకులు ప్రకాష్, అంజితో కలిసి రాఘవేంద్ర కర్నూలు మండల ఎంపీడీవో రఘునాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామంలో దాదాపు 50 విద్యుత్ స్తంభాలకు లైట్లు కాలిపోయాయని అనేకసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. గతేడాది తాగునీటి ట్యాంకులను నిర్మించినప్పటికీ నేటికి కూడా ప్రారంభోత్సవానికి నోచుకోలేదన్నారు.

ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దుదాం

సి.బెళగల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సోమవారం మండలంలోని కంబందహాల్, పలుకులదొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి, చింతమానుపల్లె గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆమె వెంట ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యా ప్రేరణపై అవగాహన సదస్సు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 17: కేవీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యాప్రేరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాప్రేరణతో భవిష్యత్ ఆశయాలకు సక్సెస్ ఫుల్‌గా సాధించవచ్చన్నారు. పాఠశాల డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్న సమస్యలను తొలగించి పరీక్ష సమయంలో శారీరకంగా, మానసి కంగా ధృఢంగా ఉండే విధంగా చేసి అన్ని ప్రశ్నలకు సమాధానం రాయడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పాఠశాల మేనేజ్‌మెంటు డాక్టర్ జయారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, కోఆర్డినేటర్ జయ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ అలవడుతుందని రేడియాలజిస్టు డా.రణధీర్ సింగ్ అన్నారు. కొండారెడ్డిబురుజు సమీపంలో కేఎంసీ పార్కులో సోమవారం తైక్వాండో బెల్టు గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. రణధీర్ సింగ్ మాట్లాడుతూ వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి సహకారంతో తైక్వాండో శిక్షణను సందర్శించానన్నారు. అనంతరం విజేతలకు బెల్టులు ప్రదానం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీరు కబీర్ బాషా



జలవనరుల శాఖ సీఈతో సత్కారం పొందిన మహిళా ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు ఎస్ కబీర్ బాషా అన్నారు. సోమవారం జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మహిళా ఉద్యోగినులకు జ్ఞాపికలు అంద జేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఈ కబీర్ బాషా మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో తమదైన ప్రతిభతో రాణిస్తున్నారని చెప్పారు. ఏటా చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో మహిళలను సన్మానించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను ఆయన సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీరు రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్ కమలాకర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, డీఈలు మహేష్, గుణాకర్ రెడ్డి, ఆఫీసు సిబ్బంది లీలాంత కుమారి, కె.గీత, శాంతిదీప్తి, నీరజ, కుర్లగుండ గీత, సాయి హైమావతి, నారాయణవర్మ, మల్లికార్జున, గంగాధరరెడ్డి, కిషోర్, ఖాలిద్, నాగలింగేశ్వరరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సాయిబాబా, శ్రీనివాసులు రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణమూర్తి, నరసన్న, చంద్రశేఖర్ ఆచారి, చిన్న ఆంజనేయులు, రవికుమార్, పుష్పావతి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో చలివేంద్రాలు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు దూర ప్రాంతాల నుంచి పంట ఉత్పత్తులను అమ్మకానికి తెచ్చిన రైతులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్ దృష్టికి రావడంతో వెంటనే వారు స్పందించారు. మూడు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో 1, వేరుశనగ, కంది తదితర పంట ఉత్పతులు విక్రయాలు జరిగే ప్రదేశంలో మరో రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు.

కోడుమూరు కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా అనంత రత్నం

కర్నూలు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కోడుమూరు కాంగ్రెస్ పార్టీ కో- ఆర్డినేటర్‌గా అనంతరత్నంను పీసీసీ షర్మిల నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సోమవా రం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నంద్యాల డీసీసీ జె.లక్ష్మి నరసింహ, సిటీ అధ్యక్షుడు షేక్ జీలానీ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, మాజీ డీసీసీ కే బాబురావులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు షరాఫ్‌బజార్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, పోస్టుఆఫీసు, కాంగ్రెస్ కార్యాలయం, వడ్డెగేరి ఏరియాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు. ప్రజలు ఈఅసౌకర్యాన్ని గుర్తించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రెడిమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా రెడిమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజను కలిసి డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల నిర్మాణం కోసం అప్పట్లో ఏర్పాటు చేసుకున్న రెడిమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ప్రభుత్వ అనుమతి ఇచ్చిందన్నారు. టిడ్కో గృహాలకు మాత్రమే వాటిని వినియోగించాలని సదరు కాంట్రాక్టర్ ప్రైవేటు బిల్డింగ్ నిర్మాణాలకు రెడీ మిక్స్ కాంక్రీట్ తయారు చేసి వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు. విచారించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

సేవా గుణం ఉండాలి

మద్దికెర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో సేవా గుణం దాగి ఉండాలని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి, మాజీ సర్పంచ్ వెంకటవర్మ అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి గ్రామంలో టీడీపీ యువసేన ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

మద్దికెర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గత ప్రభుత్వ హయాంలో రీసర్వేలో ఉన్న రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హుశేన్‌సాబ్ అన్నారు. సోమవారం మండలంలోని బురుజుల, బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రైతులు రీసర్వేకి చెందిన అభ్యంతరాలను తహసీల్దార్‌కు అందజేశారు. ప్రతిరోజు వీఆర్వోలు గ్రామాలకు వెళ్లి రావాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీదేవి ఉన్నారు.

నీటి లభ్యతను గుర్తించండి

దేవనకొండ,మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వ్యవసాయ భూమిలో నీటి లభ్యత వివరాలను సేకరించాలని డిఫైఎస్‌వో రవిప్రకాష్ మోసెజ్, తహసీల్దారు ప్రసాదు రాజు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్‌ఏ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడవ మైనర్ ఇరిగేషన్, రెండవ నీటి లభ్యత వివరాలను సమ్రగంగా సేకరించాలన్నారు. గ్రామాల్లోని చెరువులు, బోర్లు, బావులు, కాలువల ద్వారా లబ్ధి పొందే భూముల జాబితాను నిక్కచ్చిగా నమోదు చేయాలని సుచించారు. ఏఎస్‌వో హరిబాబు, తదితరులు ఉన్నారు.

పదోన్నతులు కల్పించాలి

పత్తికొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా గత ఐదు సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లను మాతృశాఖ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పదోన్నతులు కల్పించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కోరారు. సోమవారం పత్తికొండ పంచాయితీరాజ్ కార్యాయలంలో వారు వినతిపత్రం అందించారు. రాష్ట్రసహాయకార్యదర్శి ఏలూరి రవి, జిల్లా అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాపరిధిలో సుమారు 800 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం మాతృశాఖ పరిధిలోకి మార్పులచేసి పదోన్నతులు అందించాలని కోరారు.

ఆలూరు: సచివాలయల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లను వివిధ ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల్లో విలీనం చేయాలని సోమవారం సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆలూరు ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీఈఈ మల్లికార్జునయ్యాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్, అయ్యన్న గౌడ్, సుమలత, జాఫర్ ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నాయకులు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో మురుగునీరు రహదారులపై నిలిచిపోవడంతో పలు కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే పలు కాలనీల్లో తాగునీటి సమస్య వేధిస్తుందన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వ్యవసాయ కూలీలకు 9 వారాల వేతనాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, సిద్దయ్య, కాశన్న, రమేస్, రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

వెల్దుర్తి టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పట్టణ ఎస్ఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేపట్టామన్నారు. అలాగే విద్యార్థులకు పరీక్షలు బాగా రాయాలని తెలియజేశారు.

నేటి నుంచి గద్దెరాళ్ల దేవర


పూజలు అందుకుంటున్న అమ్మవారు

దేవనకొండ,మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గద్దెరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు నేటి నుండి మూడు రోజుల పాటు వైభవంగా జరగనుంది. గద్దెరాళ్ల మారెమ్మవ్వ పల్లెదొడ్డి ఆడపడచుగా దేవర ఉత్సవాలకు పల్లెదొడ్డి నుండి ప్రతి ఇంటి నుంచి బోనం, పొట్టేలు మెక్కుబడి చెల్లిస్తారు. ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం గ్రామంలో యువకుడి చేత చలువ బిందె, అమ్మవారి కోసం తెచ్చిన దున్నపోతుని ఊరేగింపు నిర్వహిస్తారు. 19న తెల్లవారుజామున దున్నపోతుని అమ్మవారికి బలి ఇస్తారు. దేవరకు జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్ష వరకు జనం రావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. కర్నూలు-బళ్లారి రహదారిపై ఉన్న స్టేజీ నుంచి గద్దెరాళ్ల అన్ని వాహనాలు వెళ్లాలన్నారు. దేవనకొండలో రహదారి ఇరుకుగా ఉండడంతో వన్‌వే చేసినట్లు తెలిపారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆరుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు 200 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందో బస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేవరలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.


ఆదోని పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రుల హడావుడి


ఆదోని మునిసిపల్ హైస్కూల్ వద్ద తమ పిల్లలకు సూచనలు ఇస్తున్న తల్లిదండ్రులు


పరీక్షకు హాజరైన విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పది పరీక్షలు ప్రారంభం

- గంట ముందుగానే పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్


దేవనకొండలో హాల్‌టికెట్ల నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు


పత్తికొండలో పరీక్ష హాజరైన విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పది పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. అరగంట ముందుగానే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. ఆదోని నియోజకవర్గంలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 3856 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 37 మంది విద్యార్థులు గెర్హాజరైనట్లు డిప్యూటీఈవో వెంకటరమణారెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. తల్లిదండ్రులను లోపలికి అనుమతించకపోవడంతో తమ పిల్లలకు బయట పరీక్షలపై పలు సూచనలు చేస్తూ ఆల్ ద బెస్ట్ పరీక్షలు బాగా రాయాలని దీవించి పంపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల సౌకర్యాలపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు.

తుగ్గలి: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఈవో రమావెంకటేశ్ గౌడు తెలిపారు. సోమవారం మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు 635 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా.. 15మంది గైర్హాజర్ కావడంతో 620 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తుగ్గలిలోని జడ్పీహెచ్ఎస్ సెంటరులో 196 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 6 మంది గైర్హాజరయ్యారు. నోవీ పాఠశాలలో 100 మంది విద్యార్థులకు గానూ ఇద్దరు గైర్హాజరయ్యారు. జొన్నగిరి జడ్పీహెచ్ఎస్‌లో 169మందికి గానూ ఇద్దరు గైర్హాజర్యారు. పెండేకల్ ఆర్ఎస్ జడ్పీహెచ్ఎస్‌లో 169 మందికి గానూ 164 మంది హాజరయ్యారు.

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో మొత్తం 428 మంది పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా.. 426 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో రంగస్వామి తెలిపారు. సోమవారం పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు 186 మంది, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 132 మందికి గానూ ఇద్దరు గైర్హాజరయ్యారు. బాలికల పాఠశాలలో 180 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 30 మంది ప్రైవేటు పాఠశాలలు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసినట్లు ఎస్ఐ విజయకుమార్ నాయక్ తెలిపారు.

ఆలూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ఆరంభమయ్యాయి.. ఆలూరు పట్టణంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 978 పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 963 మంది హాజరయ్యారు. పరీక్షలను ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి పర్యవేక్షించారు.

దేవనకొండ: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగు సెంటర్లలో 823 మంది విద్యార్థులు 807 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మొదటి రోజు పరీక్షు 16 మంది విద్యార్థులు గైర్హాజరైన్నట్లు ఏంఈవో తిమ్మారెడ్డి తెలిపారు.

పత్తికొండ టౌన్: పత్తికొండలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని సెయింట్ జోసెఫ్, ఏపీ మోడల్ స్కూల్, బాలికల పాఠశాల, యశోధా గార్డెన్ స్కూల్, గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల పరీక్ష కేంద్రాలును ఏర్పాటు చేశారు.

హొళగుంద: హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఏ.బీ పరీక్ష కేంద్రలో కరెంటు సరఫరా లేకపోవడంతో ఫ్యాన్‌లు లేక ఉక్కపోతతో, చీకటి గదుల్లో నేలపై విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఇబ్బంది పడ్డారు. అలాగే దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కల్పించడలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు తప్పలేదు. హాల్ టికెట్ నంబర్ బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు అరగంట పాటు గందరగోళానికి గురైయ్యారు. ఈ విషయంపై ఎంఈవో జగన్నాధంను వివరణ కోరగా ఎల్లుండి జరిగే పరీక్షలకు బెంచులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

చిప్పగిరి: మండలంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో జరిగిన పదవ తరగతి పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈవో సావిత్రమ్మ సోమవారం తెలిపారు. పరీక్ష మొదటి రోజైన తెలుగు పరీక్షలకు మొత్తం 295 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

శ్రీదేవి మాటలు హాస్యాస్పదం


మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

పత్తికొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ నిధులు రూ.36 కోట్లలో అవినీతి జరిగిందని విచారణ చేయాలంటూ అసెంబ్లీలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శలకు దిగడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి అన్నారు. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో సోమవారం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోక్‌నాథ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువుల అభివృద్ధి పేరిట రూ.36 కోట్లు ఇరిగేషన్ నిధులు విడుదలైంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అందుకు సంబంధించి అరకొర పనులు చేసి కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు కాజేసింది మీరు కాదా అని అన్నారు. గత వైసీపీ హయాంలోనే టమోటా జ్యూస్ ఫ్యాక్టరీకి నిధులు తెచ్చామని ఆఘనత మాదని గొప్పలు చెబుతున్న మీరు 2023 నుంచి ఎన్నికల సమయం వరకు ఫ్యాక్టరీ నిర్మాణం చేయకుండా ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో గ్రామాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సమావేశంలో టీడీపీ నాయకులు రామానాయుడు, తిరుపాల్, తిమ్మయ్యచౌదరి, చల్లారవి, కడవలసుధాకర్,తిరుపాల్‌నాయుడు, ధనుంజయుడు, తిప్పన్న, చెన్నంనాయుడు, శ్రీనివాసులుగౌడ్ తదితరులు ఉన్నారు.

తొమ్మిది నెలల్లో నియోజకవర్గం అభివృద్ధి

వెల్దుర్తి: నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే శ్యాంబాబు కృషి చేస్తున్నారని టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, బలరాం గౌడు, క్రిష్ణగిరి నాయకులు ఆలంకొండ నబి, మర్రి శ్రీరాములు అన్నారు. సోమవారం వెల్దుర్తి టీడీపీ కార్యాలయంలో క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల ముఖ్యనాయకులతో కలిసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలల్లో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు 68 చెరువులకు నీళ్లు ఇచ్చారని, రూ.25 కోట్లతో సీసీ రోడ్లు వేయించారని, రూ.11 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారన్నారు. కేఈ కుటుంబం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు ఆరోపణలు మానుకోవాలి

మద్దికెర: పత్తికొండ తాలుకా ఈ 9 నెలలో ఎంతో అభివృద్ధి చెందిందని, వైసీపీ నాయకులు ఆరోపణలు మానుకోవాలని జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పెద్ద వీరన్న, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు మూలింటి రాము యాదవ్ అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున అక్రమాలు చేశారన్నారు. రైతులు ఎన్నో ఏళ్లుగా కలలు కంటున్న టమోటా జ్యూస్ ఫ్యాక్టరీకి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు భూమి పూజ చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి మా ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. వైసీపీ నాయకులు ఆరోపణలు మానుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో మదనంతపురం శ్రీనివాసులు, హరినాథ్‌గౌడు ఉన్నారు.

ఆరెకల్లు గురుకుల పాఠశాలలో తీరిన నీటి కష్టాలు


పాఠశాలలో నీటి కోసం బోరు వేస్తున్న దృశ్యం

ఆదోని అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆరెకల్లు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలు తీరాయి. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సహకారంతో పాఠశాల ఆవరణంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉషా రాజు ఆధ్వర్యంలో బోరు వేయించారు. గురుకుల పాఠశాలలో 600 మంది విద్యార్థినులు గత కొన్నేళ్లుగా నీటి కోసం అవస్థలు పడ్డారు. సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే అక్కడ బోరు వేయించారు. ప్రిన్సిపాల్ విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ మాజీ సర్పంచ్ రాజు, బాలముని, శేఖర్, లోకేష్, ఉలిగప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి


అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయుకండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు పబ్లిక్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

వాగులోకి దూసుకెళ్లిన బోల్తా


చిన్నహోతూర్ గ్రామ సమీపంలో వాగులోకి దూసుకెళ్లిన లారీ

ఆస్పరి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నహోతూర్ గ్రామ సమీపంలో జిందాల్ నుంచి కుర్చీల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. సోమవారం తెల్లవారుజామున 3:50 నిమిషాల సమయంలో బళ్లారి నుంచి కర్నూలు వైపుకు వెళ్తున్న ఎన్ఎల్‌ఓఏజీ7059 అనే లారీ జింకలు రోడ్డుకు అడ్డంగా రావడంతో తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న వాగులోకి దూసుకెళ్లింది. డ్రైవర్ హరి శంకర్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

బొడ్రాయికి పూజలు


బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న దాతలు

మద్దికెర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలో ఊరు వాకిలి నిర్మించిన బోడ్రాయికి నిర్మాణ దాతలు లక్ష్మీనారాయణ దంపతులు వైభవంగా పూజలు చేశారు. సోమవారం బోడ్రాయి ఏర్పాటు చేసి 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని బోడ్రాయిని ఐదు పడగల శేషనాగుతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బోడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పత్తికొండ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన తరగతుల వారికి టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టైలరింగ్‌కు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించిందని, ప్రధానంగా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు వర్గాల వారికి శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇసుక అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో యథేచ్ఛగా జరుగుతున్న ఇసుక అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి విజయ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొందరు ఇసుక మాఫీయాకు చెందిన వారు అక్రమ డంప్ యార్డులను నిర్వహిస్తూ అధిక ధరలకు అమ్ముకొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇసుక మాఫీయాపై చర్యలు తీసుకొని సామాన్యులకు ఇసుక కనీస ధరలకు అందేలా చూడాలని తహసీల్దార్ శివరాంకు వినతి పత్రం అందజేశారు. నాయకులు న్యాయవాది లోకేష్, రమాకాంత్, చంద్ర, వాల్మీకి సాయి ప్రసాద్, జాఫర్ తాయన్న, రాజు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం

దేవనకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లచెలిమల (నర్మామల)లో వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి లక్ష్మి, భూదేవి లతో వివాహం జరిపించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి గ్రామంలోని బోడ్రాయి వరకు స్వామివారి రథోత్సవ వేడుకలను గ్రామస్థులు వైభవంగా జరిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తే చర్యలు


పట్టుబడిన కర్ణాటక మద్యంతో పోలీసులు

ఆలూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక మద్యం తరలించే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ సుదీర్ బాబు అన్నారు. సోమవారం క్షేత్రగుడి చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు. నవోదయ 2.0 కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు వివరించి నాటు సారా తయారీ, విక్రయాలను నిలిపివేయాలన్నారు. అలాగే ఆలూరు పట్టణంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను, 5 లీటర్‌ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆలూరు ఎక్సైజ్ సీఐ లలితదేవి, ఎస్సై నవీన్ బాబు, డీపీఎఫ్ సీఐ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐ తేజ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నూతన కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఉద్యోగులకు సంబంధించిన ఏ విధమైన ఆర్థిక సహకారం ఇంతవరకు అందలేదు అన్నారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి నివేదిక వచ్చేలోపు ఆలస్యం అవుతుందని వెంటనే మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, ఆరియర్స్‌ను అందేవిధంగా జీవోలు విడుదల చేయాలన్నారు. 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్స్ బిల్లులు, పీఎఫ్ బిల్లులు చెల్లించాలన్నారు.

హామీలను అమలు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి. కాలప్ప డిమాండ్ చేశారు. సోమవారం కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులపై వివక్ష చూపారని అన్నారు. చేనేత రంగానికి రూ2000కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఎన్నికల సభల్లో నేతన్న నేస్తం రూ.24వేలు కంటే ఎక్కువ ఇస్తామని, మూడు సెంట్ల స్థలం ఇచ్చి చేనేత షెడ్లు కట్టిస్తాం, చేనేత మగ్గాలు ఉన్నవారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. నందవరం, నాగలదిన్నె, గోనెగండ్ల, ఎమ్మిగనూరు పట్టణంలో వేలాదిమంది చేనేత వృత్తిపై ఆధారపడ్డారని, టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణ, రాముడు, లక్ష్మన్న, రాజు, వెంకటేసులు, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మంత్రి వర్గం ఆమోదంపై హర్షం

ఎమ్మిగనూరు, మార్చి17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకోవటంపై టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉమ్మడి రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణను సమర్థిస్తూ గత ఏడాది సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణ అమలుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏక సభ్య కమిషన్ నియమించిన విష యం తెలిసిందేనన్నారు. ఆయన ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఆమోదం తెలుపుతు నిర్ణయం తీసుకుందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే 59 ఉపకులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబుకు మాదిగలు, ఇతర ఎస్సీ ఉపకులాలు రుణపడి ఉంటారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ లభ్యం

మంత్రాలయం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జగనన్న కాలనీ సమీపంలో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. ఆదివారం చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గ జిల్లా అబ్‌జల్‌పూర్ తాలుకా పాల గ్రామానికి చెందిన కరబసప్పగౌడ్(30)గా గుర్తించారు. మృతుడి సెల్‌ఫోల్ ఆధారంగా అతని స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో తల్లి కస్తూరి ఇద్దరి చెల్లెళ్లు సోమవారం సాయంత్రం మంత్రాలయానికి వచ్చారు. బెంగళూరులో బాస్కెట్ కంపెనీలో డెలివరి ఎగ్జిక్యూటివ్‌గా పని చేసేవాడు. ఈ నెల 14న మంత్రాలయానికి వచ్చి రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ఊరు బయటకు వెళ్లి వేప చెట్టుకు ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు ఆర్థిక పరిస్థితులే కారణమని తల్లి తెలిపింది. పెళ్లీడుకు వచ్చిన ఇద్దరి చెల్లెళ్ల పెళ్లిలు చేయకలేక కుటుంబ భారాన్ని మోయలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి తెలిపింది. మృతదేహం బాగా కుళ్లి పోవంతో సంఘటన స్థలంలోని ఎమ్మిగనూరు ఆసుపత్రి వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు.

కాచాపురం గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు

మంత్రాలయం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపురంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న లక్ష్మీదేవిపై జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ ఎస్.రవి తెలిపారు. సోమవారం కచాపురంలో పని చేస్తున్న వీఆర్వో పుష్పాకు రీసర్వేలో పని చేసి రీసర్టిఫికెట్ ఇచ్చినప్పటికి వీఆర్వో పుష్పాకు జీతాన్ని నిలిపేసిన లక్ష్మీదేవిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు కోరారు. తహసీల్దార్ ఫోన్ చేసిన స్పందించకపోవడంతో ఎంపీడీవో రాధకు, డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కపటి నాగలాపురం గ్రామానికి చెందిన కురువ వీరేష్(28) ఈనెల 13న రాత్రి ఎమ్మిగనూరు నుంచి ఆదోనివైపు ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు. వెనుక నుంచి ఆదోని వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడి వీరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు.

మృతదేహం లభ్యం

పెద్దకడుబూరు , మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికనుమ ప్రాజెక్టులో గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. మూడు రోజుల క్రితం ప్రాజెక్టులో చేపలవేటకు వెళ్లిన మస్కీ నాగరాజు(56) ప్రాజెక్టులో గల్లంతైన సంఘతి విధితమే. అయితే మూడు రోజులుగా మస్కీ నాగరాజు కోసం అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా సోమవారం గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు సీఐ మంజునాథ్, అగ్నిమాపక అధికారి రామాంజనేయులు తెలిపారు. పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

గుడిసె దగ్ధం

కోసిగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని 4వ వార్డు బసవన్న కట్ట సమీపంలోని కంపాటి మారయ్య, నాగలక్ష్మి దంపతులకు చెందిన కొట్టం సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంట్లో కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లడంతో ఇంటికి తాళం వేసి ఉంది. ఒక్కసారిగా కొట్టం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగి పూర్తిగా మంటలు వ్యాపించి ఇంట్లో ఉన్న సామానులు, రూ.1.10 లక్షల నగదు, రెండు తులాల బంగారం, బియ్యం, బట్టలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్, ఏఎస్ఐ నాగరాజు విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మంటల్లో పూర్తిగా కొట్టంతో పాటు సామానులు కాలిపోయాయని, ప్రభుత్వం బాధితున్ని ఆదుకోవాలని కాలనీవాసులు తెలిపారు. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు కంపాటి మారయ్య నాగలక్ష్మి దంపతులు తెలిపారు.



కాలిపోయిన ఇంట్లోని సామగ్రి

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు గత సబ్ రిజిస్ట్రార్ రాందాస్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నీలావతి, శ్రీరామ్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 135/2 ప్లాట్ నెంబరు.68ను 2017లో ఒకరికి, 2023లో మరొకరికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ రాందాసు రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. చెల్లని ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్ట్రార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలన్నారు. ఆయనపై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు కూడా ఫిర్యాదు చేశామని వారు పేర్కొన్నారు.

● ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, హోళగుంద ప్రాంతాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకుల రాజు, జాతీయ లంబాడీ సంఘం రాష్ట్ర సమన్వయకర్త ఆర్ యోగేష్ నాయక్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతాల్లో పదివేల మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబ డటంతో వారు బళ్లారి, గుంటూరు, హైదరాబాదు, ముంబై, కలకత్తా దూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కాబట్టి వారి చదువులకు ఆటంకం కలగకుండా ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

● ఆలూరు నియోజకవర్గం మరకట్ట గ్రామంలోని దళితవాడలో గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని జిల్లా మాల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు దామోదరం రాధాకృష్ణ, జైబీమ్ సాయిరాం, కసాపురం వెంకటేశ్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, మాధవస్వామి, మునయ్య, కేశవ్, మల్లికార్జున పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రైతుల ఆర్థికాభివృద్ధి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రైతులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మాధవరం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం రాయితీపై ఇచ్చే వ్యవసాయ పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రాకేష్‌రెడ్డి, రామకృష్ణ, బొజ్జప్ప, రాఘవేంద్ర పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

పెద్దకడుబూరు , మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకడుబూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారన్నారు. నేటి వరకు రైతులకు ఎలాంటి పరిహారం అందలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. హనుమన్న, పెద్దారెడ్డి, బాలరాజు, బాబు, మునెప్ప పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలి

కోసిగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో బడికి తాళాలు వేశారని, విద్యార్థులకు ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో చదువులు చెబుతున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉర్దూ పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, ముస్తఫా, రఘు, నరసింహులు పాల్గొన్నారు.

సమష్టిగా నిర్వహిద్దాం: ఎమ్మార్పీఎస్

మంత్రాలయం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి). భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని దళితులంతా సమష్టిగా నిర్వహించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు యోబు, నేపాల్ అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులంతా ఐక్యంగా అంబేడ్కర్ జయంతిని నిర్వహించేందుకు కలిసి రావాలని కోరారు. అదే రోజున వృద్ధులకు, వితంతువులకు, అనాథలకు దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దావీదు, అనిల్, నరసింహులు, ఇశ్రాయేలు, ఆనందు, అబ్రహము, బాలు, బబ్లు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కార్యకర్తకు అండగా ఉంటాం

కౌతాళం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు అండగా ఉంటామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. సోమవారం కుంటనహల్ గ్రామంలో టీడీపీ మైనార్టీ గ్రామ నాయకుడు రఫీని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. తమ వంతుగా రూ.25వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సిద్దు, మైనార్టీ సెల్ నాయకుడు రహిమాన్, ఎస్సీ సెల్ నాయకుడు రాజబాబు ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి

పెద్దకడుబూరు , మార్చి17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వెంటనే ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్రప్రధాన కార్యదర్శి రామన్న, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడుబూరులో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

మఠం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన అభిజిత్ సేతురామ్ అనేభక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని శ్రీమఠం అభివృద్ధి పనులకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మంత్రాలయం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఎండలు దృశ్య ప్రజలు వడదెబ్బ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు సూచించారు. సోమవారం కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం చిలకలడోణ గ్రామంలో మండల వైద్యాధికారి గోవిందమ్మ ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధుల సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రత వల్ల అలసట, నోరు ఎండిపోవడం, తలకొప్పి, వాంతులు, జ్వరం, వళ్ళునొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే స్థానిక ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. అవసరమైతే బయటకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌వో వంకటలక్ష్మి, సూపర్‌వైజర్ భారతి, తులసి, ఖలీల్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: మహిళలు క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహన కల్పించడం ఆరోగ్యశాఖ అధికారులు, ఆరోగ్య కార్యకర్తల బాధ్యత అని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు అన్నారు. సోమవారం గోనెగండ్లలోని ఆరోగ్యకేంద్రంలో సామాజిక ఆరోగ్య కార్యకర్తలకు, మహిళా ఆరోగ్య కార్యకర్తలకు ఎన్‌సీడీ, సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన రొమ్ముక్యాన్సర్, నోటి క్యాన్సర్,



చిలకలడోణలో గ్రామస్థులతో మాట్లాడుతున్న
జిల్లా సంచార చికిత్స అధికారి రఘు

గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన మహిళలు ఎక్కువగా పడుతున్నారని, దానిని గుర్తించేందుకు ప్రభుత్వం క్యాన్సర్ సర్వేలు చేపట్టిందని తెలిపారు. ఆరోగ్యసిబ్బంది ప్రతి రోజు గ్రామాలలో సర్వేలు నిర్వహించాలన్నారు. నోటిలో ఎర్ర, తెల్ల మచ్చలలో పుండ్లు ఉంటే వెంటనే పరీక్షలు చేయించాలన్నారు. సమావేశంలో వైద్యులు రంగారవళి, రుక్సానా, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మేరీ గోల్డ్, భారతి, హనుమంతు, సుధాకర్, శాంతమ్మ, కృష్ణ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాన్ని సీజ్ చేయాలి



ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

నందవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నెలో అధిక రేట్లకు ఎరువులను విక్రయిస్తున్న దుకాణాన్ని సీజ్ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు దేవపుత్ర డిమాండ్ చేశారు. సోమవారం ఏడీఏ మహ్మద్‌ఖాద్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాసిరకం లిక్విడ్ మందులను అంటగడుతున్నాడని ఆరోపించారు. రైతులు యూరియ ఎరువుల మందులు అడిగితే లింకుగా లిక్విడ్ మందులు తీసుకుంటే యూరియ ప్యాకెట్ ఇస్తామంటు న్నారన్నారు. రైతులకు రశీదులను కూడా ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో స్వామి దాసు, బాలజీ, అనుమంతు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులను మోసం చేసిన పట్టణంలోని ఓ కోచింగ్ సెంటర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీఎస్‌వైఏ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ డీఎస్సీ కోచింగ్ పేరుతో నిరుద్యోగుల నుంచి వేలకు వేలు వసూలు చేశారన్నారు. సిలబస్ పూర్తయ్యే వరకు కోచింగ్ ఇస్తానని చెప్పి సిలబస్ పూర్తిచేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రవి, రామాంజి నాయుడు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రాలయం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు భూంపురం నరసప్ప (68) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేశన్న, భీమిరెడ్డి, నాగరాజు, హంస్సేని తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

ఎమ్మిగనూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు కేటీ సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి ఈరన్నలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మిగనూరులో స్థానిక పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రశేఖర్, ఏఈ జయన్నలను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో 800మందికి పైగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్నారన్నారు. వీరంతా గత ఐదేళ్లుగా ప్రభుత్వ చేపట్టిన ప్రతిష్టాత్మకమైన నిర్మాణాలలో ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ శాఖలలో సర్దుబాటు చేయాలని కోరారు. అలాగే వారి భవిష్యత్తుకు సంబంధించిన ప్రమోషన్ చానల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం ట్రెజరర్ ప్రదీప్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు ఊరట

నందవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట కల్పించినట్లు ఎంపీడీవో పుల్లయ్య, హౌసింగ్ ఏడీ వరప్రసాద్ అన్నారు. సోమవారం నందవరం ఎంపీడీవో కార్యాలయంలో వారు అధికారులతో సమావేశం నిర్వహించారు. గతంలో యూనిట్ కాస్ట్ రూ 1,80,000 ఉండటం వల్ల ఇళ్లు నిర్మించుకునే వారు చాలా ఇబ్బందులు పడ్డేవారన్నారు. మెటీరియల్ రేటు కూడా పెరగడంతో ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనంగా అమౌంట్ పెంచిందన్నారు. అమౌంట్‌ను గృహ నిర్మాణ లబ్ధిదారులకు నాలుగు విడతలుగా ఖాతాలోకి జమ చేసుందన్నారు. మండలంలో 262 మంది లబ్ధిదారులు ఉన్నారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు.

బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, పార్టీ నాయకులు రాజు డిమాండ్ చేశారు. సోమవారం బ్యాంకు ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విడుదల చేసిన బీసీ కార్పొరేషన్ రుణాలను అర్హులైన వారికి కాకుండా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అనర్హులకు ఇస్తున్నారన్నారు. దీంతో అర్హులైన నిరుద్యోగులు నష్టపోతున్నారన్నారు. అనర్హులకు రుణాలు ఇస్తున్న బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిక్కన్న, గిడ్డయ్య, మారెప్ప, అంజినయ్య, లక్ష్మణ్, నాగేష్, రాములు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

ఎమ్మిగనూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 3765 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఎమ్మిగనూరు పట్టణంలో 14 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా కేంద్రాలకు విద్యార్థులు దాదాపు గంట ముందే చేరుకున్నారు. కేంద్రాల బయట ఏర్పాటు చేసిన బోర్డుల్లో విద్యార్థులు తమ నంబర్లు చూసుకొని ఆయా గదుల్లోకి వెళ్లారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరుతో పాటు ఇతర సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ నాయక్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని ఆయా పరీక్షా కేంద్రాలను ఎస్ఐ నాయక్, ఏఎస్ఐ కిష్టప్ప నాయక్‌లు పర్యవేక్షించారు.

ఎమ్మిగనూరు రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని బనవాసి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఉదయం 9గంటలకంతా విద్యార్థులు కేంద్రానికి చేరుకున్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష చీఫ్‌గా శివరాముడు, శకుంతల విధులు నిర్వహించారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రంలో మొత్తం 546 మందికిగాను 536 మంది విద్యార్థులు పది పరీక్షలు రాశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం నాలుగు సెంటర్లలో 910 మంది విద్యార్థులకు గానూ 878 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 32 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారనీ ఎంఈవో-2 శోభారాణి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంత్రాలయం: మండలంలో పదో తరగతి పరీక్షల్లో 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటిరోజు తెలుగు పరీక్ష కావడంతో విద్యార్థులు ఉల్లాసంగా కనిపించారు. ఎంఈవో రాగన్న, పరీక్షల చీఫ్‌లు నర్సప్ప, తిమ్మప్ప, శ్రీనివాసులు, బాలకృష్ణ, లచ్చప్ప, విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో నాలుగు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు ధైర్యం చెప్పుతూ కనిపించారు. విద్యార్థుల వాచీలు, బ్యాగులు పెట్టుకోవడానికి కౌంటర్లు లేకపోవడంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాసేందుకు మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 627 మంది విద్యార్థులకు గాను 617మంది పరీక్షకు హాజరయ్యారని ఎంఈవో నీలకంఠ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

నందవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నందవరం మండలంలో 394 మంది పరీక్షలు రాయగా 389 మంది హాజరయ్యారు. ఎంఈవో రఘునాథ్ పర్యవేక్షించారు.

కౌతాళం: పదో తరగతి పరీక్షలు సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాధికారి శోభారాణి తెలిపారు. మండలంలో మొత్తం 1040 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 889 మంది హాజరుకాగా 151 మంది గైర్హాజరయ్యారు.



గోనెగండ్లలో విద్యార్థినులను ఉచిత బస్సులో ఎక్కిస్తున్న ఎంఈవో



ఎమ్మిగనూరు ఎస్ఎస్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్ఐ నాయక్, పోలీసులు



మాధవరం పరీక్షా కేంద్రం వద్ద
విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



కోసిగిలో పరీక్షా కేంద్రంలోకి పరుగులు పెడుతున్న విద్యార్థి